# మెలిక

నాయనా, రత్నం! కరమల చెంగల్రాయాచారిని తెలుసునా నీకు? తెలిసుండదు. అతడు కట్టెచాలించుకొని కడతేరిపోయి పది పన్నెండేళ్ళాయ. వీధిలో బడిపక్కన్నే ఇల్లు. ఇప్పుడు కొలిమి పనిచేసే సుబ్బరాయాచారి, బంగారు పనిచేసే వీరాచారి, కొయ్యపనిచేసే నాగలింగం ఆచారి వుండారు గదా, వీళ్ల నాయనే చెంగల్రాయాచారి, ముగ్గురు కొడుకులు. ఇద్దరు కూతుండ్లు. తానూ, తన భార్య. ఒకని చేతుల కష్టం ఏడుమంది బతకాల. కష్టజీవనం.పనిచేస్తే కుండ కాలె. లేకపోతే కడుపు కాలె. అదీ పరిస్థితి. తానేమో, తన పనేమో నోట్లో నాలుక లేనోడు చెంగల్రాయాచారి. అటువంటి మనిషి ఎట్లాచేసినాడో గానీ, ఒక పొరపాటు పనిచేసినాడు గదయ్యా! 'ఇంక లేదు. కరమల చెంగల్రాయాచారి పని ముగిసింది' అనుకొన్రి గ్రామమంతా.

ఏం జరిగిందంటే,

ఎనిమిదికంతా చద్దన్నం తిని పేటకు బయల్దేరినా. ఊరి ముందర రాగిచెట్టు కిందికి వెళ్లేటప్పటికి గనుమగట్టుపల్లె వెంకటాద్రి ఎదురైనాడు. "ఏమయ్యా, అయ్యవారా! ఎట్టయితేనేమి, గట్టి పనోడేనయ్యా చెంగల్రాయాచారి! ఈ పిల్లి ఆ పాలు తాగునా అనేటట్టుండే వాడుగదా! ఇప్పుడు జూడు. కన్నట్టా వుండగానే కంట్లో పాపనే కత్తిరించేసినాడు. ఎర్రటోపీ వాళ్లొచ్చి కమ్ముకునేదాకా ఆ సామి ఇంతటోడని తెలియకపోయ! పో, పో పోయ్ చూడు. నీకు తెలుస్తుంది...?" అంటూ తిరిగి చూడకుండా రోడ్డుదారి పట్టినాడు వెంకటాద్రి.

గబగబా పదడుగులేసి, ముసాఫర్లమిట్ట దాటుకొని, వీధిలోకి పొరజూచినా. ఆచారి ఇంటి ముందర జనం పెద్ద గుంపుగా చేరిపోయినారు. దగ్గరికి వెళ్లేటప్పటికి "ఒరే, ఒరే, అయ్యవార్రా!" అంటూ చీలబారి, నాకు దారిచ్చినారు. చుట్టుకైవారంగా చేరిపోయిన జనాల మధ్యన ఖాకీ డ్రస్సులతో జమాజట్టీల మాదిరిగా నలుగురు పోలీసులు నిలబడిపోయి వుండారు. వాళ్లకెదురుగా 'నిలబడి వుందునా, కూలబడిపోదునా' అనే పరిస్థితిలో చెంగల్రాయాచారి! ముఖంలో నెత్తురు చుక్కలేదు. పెదిమలు, నాలిక ఎండిపోయినాయి. ఒళ్లంతా చెమట పట్టేసింది. అతని పాదాలకు దగ్గరగా బద్దెలు, పట్టాలు, పొరతూములు, మరలు, మేకులు, దళసరి రేకులు, ఎంత లేదన్నా ఒక కుక్కి తట్టకు పట్టేటన్ని ఇనపసామాన్లు పెద్ద కుప్పగా పడివుండాయి.

"ఏం వాయ్, ఆచారీ! చూచిచూచీ గవర్మెంటుకే ఎసురుపెట్టేస్తివే! రైల్వే సొత్తే చోరీ చేస్తావా? అదేమని అడగతావుంటే మాటాడకుండా హఠంపద్తావా? మాటాడకపోతే నీ నేరం మాఫీ అయిపోతుందా? చెప్పు. ఈ పని నువ్వొకడివే చేస్తివా? ఇంకా కొందరు వత్తాసుగా వుండారా? ఆఖరుసారిగా అడగతావుండా! చెప్తావా, లేదా?" అని హెడ్డు కానిస్టేబులు వుడ్రిస్తా వుండాడు.

అయితే ఎంతకూ నోరు తెరవడే ఆచారి!

అప్పటివరకూ ఇలాగే అంతట్లోనూ అన్నెంపున్నెం తెలియని అమాయకుడనిగదా ఆచారికి పేరు! కానీ ఈ చోరీకేసు ఒకటి తలపైన పడేటప్పటికి జనంలో అతనిపైన వుండిన మంచి అభిప్రాయం పటాపంచలై పోయింది. 'అమ్మో, కడుపులో పండ్లమ్మా ఈ మనిషికి' అనేటట్టుగా అక్కడున్న వాళ్లందరూ అతణ్ణి కొరకొరా చూస్తూ వుండడం నేను గమనించినాను.

పోలీసోళ్లేనా ఊరుకునేవాళ్ళు! "నువ్విట్లా మంచిమాటల్తో చెప్పవులే! స్టేషనుకు తీసుకుపోయి చెయ్యాల్సిన పూజ చేస్తే అప్పుడొప్పుకుంటావు!" అని బుసలు కొట్టినాడు హెడ్డు కానిస్టేబులు. అతడు చెప్పినమీదట గ్రామ తలారి రకంవారిగా చోరీ సామాన్లను వేరుపరిచినాడు. కరణం జాబితా తయారుచేసినాడు. "ఎవరి దగ్గరైనా ఒక సాక్షి చేవ్రాలు పెట్టించుకో" అనినాడు కరణంతో పోలీసు.

"ఎవరో ఎందుకు! మా ఊరి అయ్యవారే వుండ్లా!" అనినాడు కరణం.

"మరీ మంచిది! అయ్యవారి మాటకు తిరుగుండదు" అని హెడ్డు బలపరిచినాడు.

నా గుండె జల్లుమంది. 'ఇదేందిరా దేవుడా! ఏనాడూ కోర్టు ముఖం చూళ్లేదే! తెట్టతేరకు ఈ పీడ ఒకటి మెడకు చుట్టుకొనిందే!' అని నాలో నేను మథనపడిపోతా వుండాను. కరణమేమో తన పాటుకు తాను జాబితా నా చేతికిచ్చేసినాడు. కలంపుల్ల వేళ్ళసందున ఇరికించినాడు. "పెట్టు, పెట్టు" అని పోలీసులొకపక్క తొందరపెడ్తావుండిరి. గాంధీ మహాత్ముడనే పెద్దాయన ఒకడు వచ్చి, స్వరాజ్యమనీ సత్యాగ్రహమనీ కొన్ని మాటలు ప్రబలమైపోయినాక ఇప్పుడు పోలీసులంటే కొంచెం భయం తగ్గింది గానీ, అంతకుముందు వాళ్ళ మాటంటే రాజశాసనమే! బదులు మాటాడి బతకొచ్చునా? మారుమాటాకుండా కాగితంపైన చేవ్రాలు పెట్టేసినాను.

చోరీ సొత్తును గోనెసంచుల్లో వేసి రెండు మూటలుగా కట్టిరి. ఒకటి తలారి ఎత్తుకోగా, ఇంకొకటి ఆచారి తలపైన్నే పెట్టిరి. అప్పటికి బస్సుల్లేవే! రేణిగుంట నుండి పాకాలకు,పాకాల నుండి ధర్మావరానికి నేను పుట్టకముందే చిన్నరైలయితే పడిందిగానీ, అది వచ్చేదీ పోయేదీ రోజుకు రెండుసార్లే. మొగరాల పేటనుంచి పాకాలకు అడ్డదారిలో అయిదుమైళ్లు. ఆ కాలపు మనుషులకు అదేం లెక్కా జమా! అయిదగుడుల్తో సమానమే గదా! పోలీసోళ్ళు చోరీసొత్తు నెత్తించుకోని, నేరుగా అడ్డదారిలో పాకాల పోలీసుస్టేషను దారిబట్టిరి.

రెండు వారాలకు పైగా రిమాండులో వుండి బెయిలుపైన ఆచారి తిరిగొచ్చినాడు. ఎట్లా వచ్చినాడు? దిట్టంగా పిడికొయ్యమాదిరిగా వుండినవాడు,వేళ్లు కదిలిపోయిన ఊడగచెట్టు మాదిరిగా ఊగిపోతా వచ్చినాడు. కేసు తిరుపతి సబ్ మేజిస్ట్రేటు కోర్టులో నమోదైంది. చోరీ అయింది రైల్వే సొత్తుగదా, అందువల్ల కేసు గవర్మెంటు కేసైపోయింది. రైల్వే డిపార్టుమెంటు తరపున వాదించేదానికి వాళ్లవాళ్లే వుంటారు. మరయితే ఆచారి మాట? మునిగినా తేలినా ముద్దాయికి గూడ ఒక వకీలుండాలగదా! ఆచారికేమో కోర్టు ముఖం తెలియకపోయ. వకీలును కుదిర్చి పెట్టేందుకు గూడా మళ్ళీ కరణమే కావలిసొచ్చినాడు. ఇద్దరూ కలిసి తిరుపతికి వెళ్ళొచ్చిరి.

"వకీలు కుదిరినాడంట. పాపం, ఆచారి స్థితిగతులు గమనించి ఫీజు కోసరం ఎక్కువగా నొక్కలేదంట! శిక్షపడితే నాకేమీ యివ్వొద్దు. కేసు తోసేసినారంటే నాలుగు మణుగుల చింతపండు, రెండుపీశల నెయ్యి మాత్రం తెచ్చిపెట్టు అనినాడంట' అని ఊరంతా చెప్పుకొన్రి.

'ఊరింగు' నాలుగురోజుల్లో వుందనగా నాకున్నూ వచ్చేసింది గదయ్యా సమను! ఆచారి ఇంట్లో దొగసొత్తు బయటపడినమాట నిజమేనని గవర్మెంటు తరఫున సాక్ష్యం చెప్పాల! చెప్పక తప్పుతుందా? ఊరంతా గుమిగూడి సాక్షాత్తుగా చూచిన సంగతి గదా! అపద్ధం చెబితే, 'ఛీఛీ, వీడేం అయ్యవాన్రా' అనుకోరా?

తప్పదు! ఆరునూరైనా, నూరుఆరైనా నిజం చెప్పాల్సిందే! అయితే ఇంతలో ఏం జరిగిందంటే, కేసు విచారణ రేపుకాదు మర్నాడనగా ఈనాటి సాయంకాలం బాగా

చీకటిపడి పోయినాక ముఖం కనపడకుండా ముసుగుకప్పుకొని ఒక మనిషి మన యింటికొచ్చేసినాడు గదయ్యా రత్నం!

'ఎవర్రా ఇతను' అని మేమంతా బిక్కబోయి చూస్తూవుండాము. వచ్చినవాడు, రావడం రావడం తడవుగా నా చేతుల్ని గట్టిగా పట్టేసుకొన్నాడు. "సామీ, అయవారా! ఇవి చేతులుకాదు. నా బుద్ధి గడ్డితినింది. ఒక తలకొట్లమారి ఆ దొంగ సామాన్లు తెచ్చి నాకంటగట్టినాడు. పేరు బయటపెడితినంటే వాడు నా తల పుర్రె లేపేస్తాడు. ఎగదీస్తే గోహత్య దిగదీస్తే బ్రమ్మత్య. నాకు ప్రాణసంకటమై పోయింది. బిడ్డలేమో లేదర బిడ్డలు. పెళ్లానికా వగాతగా లేదు. నేనింట్లో లేకపోతే ఒకరోజు సంసారం గడవదు. నువ్వే నన్ను కాపాడాల. నీట్లో ముంచినా, పాలల్లో ముంచినా నీదే భారం. కేసు నిరూపణై జైలుకెళ్ళి వచ్చేస్తినో, నాకింక సాటి కులస్తుల్లో నల్లముంతలో నీళ్లు పుట్టవు. అంతకంటే ఉరేసుకొని సచ్చేదే మేలు...?" ఇట్లా గింజుకొన్నవాడెవడో కాదు. చెంగల్రాయాచారే!

"అయితే నువు చెప్పేదెట్టయ్యా అచారీ! నిండు చెరువులో నీళ్లేదని బుకాయించమంటావా? కోర్టుకు పోయి, బోనెక్కి రామాయణంపైన ప్రమాణం చేసి అపద్ధం చెప్తే నాకు పుట్టగతులుంటాయా?" అని నేను నిగ్గదీసినాను.

"కాదు సామీ! అట్టాకాదు నువ్వపద్ధం చెప్పొద్దు. నిజమే చెప్పు. కానీ నిజానికి గూడా ఎన్నో మెలికలుంటాయని మా వకీలు సెప్పినాడు. 'మీ ఊరి అయవారు మంచోడేనా? మనుషులంటే కనికరమున్నోడేనా? మనం చెప్తే వింటాడా? వినేట్టయితే నా దగ్గరికి పంపించు' అనినాడు. నువు పెద్ద మనసుపెట్టి రేపు సాయంత్రానికి తిరుపతికి సేరుకోవాల. అయితే నేను మాత్రం లోనికి రాను. బయట్నే వుంటాను. నాకయినా తెలియనీడంట" అని ఒకే ప్రాధేయపడినాడు అచారి.

నేనూ ఆలోచించి చూచినాను. అపద్ధంగాపోతే చెప్పొచ్చు గదా! అందువల్ల ఆచారికి మేలు జరిగితే మరీ సంతోషమే గదా! "సర్లేవయ్యా ఆచారీ, అట్లనే వెళ్దాములే! నువ్వెప్పుడు బయల్దేరమంటే అప్పుడే బయల్దేరుదాము" అని మాట ఇచ్చేసినాను.

మరురోజు సాయంత్రం స్టేషనులో దిగేటప్పటికి పొద్దుపోయింది. కట్టుకొనిపోయిన పులుసన్నాన్ని ఒక సత్రంలో కూర్చొని భోంచేసినాము. ఆచారి గోవిందరాజుల గుడిదగ్గరే నిలబడి పోయినాడు. దక్షిణ మాడవీథిలో వకీలింటికి గురుతులేవో చెప్పినాడు. వీధిలో అడుగులేస్తావుంటే సింహం గుహలోకి వెళ్ళిన కుందేలు చందంగానే వుంది నా పని. అయినా రోటిలో తలదూర్చినాము గదా! రోకటి పోటుకు వెరిచేదేముంది? ఇంటి ముందర బోర్డు జూచినాను. కచేరీ గదిలో దీపం వెలగతా వుంది. నడవలోకి వెళ్ళి దగ్గినట్టుగా గొంతు సర్దుకొన్నాను. "ఎవరు, ఎవరూ" అని పిలుపు వినిపించింది. ద్వారంలో నుంచి తల మాత్రం లోపలికి పెట్టి "నేనండి! మొగరాల ఎయిడెడ్ ఎలిమెంటరీ స్కూలు టీచర్ని! రైల్వే సొత్తులో చోరీకేసులో సాక్షిని" అనినాను. "ఓహో,నువ్వంటయ్యా! వెంకట పెరుమాళ్లు గదా నీపేరు! రారా, కూచో" అనినాడాయన. వెళ్లి కూర్చున్నా. గదినీ, గదిలోని లా పుస్తకాల బీరువాల్నీ, క్లైయింట్లు కూర్చునే బెంచీకవతల, మేజాపైన కట్టలు కట్టలుగా పేర్చిపెట్టిన దస్తావేజుల దొంతర్ల వెనుక కుర్చీలో కూర్చొన్న పిట్టలాంటి మనిషిని చూపులు మార్చిమార్చి చూచినా. ఈయనేనా వకీలు! కలిగిన మారాజుల దగ్గర వందలూ, వేలూ గుంజుకోనీ, లేని వాళ్ళకు ఊరికేనే కేసులు వాదించిపెట్టే పేరుమోసిన అడ్వొకేటు కపిస్థలం చినదొరస్వామి అయ్యంగారంటే ఈయనేనా!

మనిషి ఎట్లా వున్నాడనుకొంటివి? రెకరికా, సన్నగా, ఎర్రగా, నాలుగు పరకల జుట్టు గాలిలో కదలాడుతూ వుండగా, చొక్కాపైన ఓ తుండుగుడ్డ వేసుకొని, భోజనానంతరం నమిలిన తాంబూలంవల్ల ఎర్రబడిన పెదిమలతో, వర్చస్సు పొంగే ముఖంతో, పులుగడిగిన మ:త్యం మాదిరిగా వుండాడయ్యా చిన దొరస్వామి అయ్యంగారు! చూడగానే నమస్కారం పెట్టాలనిపించాల ఎవరికైనా!

"ఫరావాలేదే! చెంగల్రాయాచారి గట్టివాడేనే! నిన్ను నా దగ్గరికి పంపించలే దనుకొంటిని! ఎట్లనో సాధించినాడే! మహాభారతంలో ధర్మరాజు భీష్ముడిపాదాలు పట్టుకోని నీ ప్రాణరహస్యమేందో చెప్పు స్వామీ అనినట్టు లేదూ?" ఆయన గలగలా నవ్వేసినాడు. "సరేలే. నువ్వెప్పుడొస్తివి? భోంచేస్తివా? ఆచారి ఎక్కడ?" అని పరామర్శించినాడు. అయితే బదులు చెప్పేదాకా ఊరుకోలేదు. వెంటనే "ఏమయ్యా టీచరూ! నసుగుసులొద్దు. ఒక్కమాటలో చెప్పు. బిడ్డల తండ్రి, బడుగు మనిషి, దిక్కూదరీ లేనోడు చెంగల్రాయాచారిని కాపాడదామంటావా? లేకుంటే వాని కర్మకు వాణ్ణి వదిలేద్దామంటావా?" అని నేరుగా ముగ్గులోకి దిగేసినాడు.

"అయ్యా, తమరు పెద్దలు! న్యాయాన్ని, ధర్మాన్ని తరచి చూసినోళ్ళు, మీరు ఆచారికి మేలు చేయాలనుకుంటే, ఉండూరువాణ్ణి. నేను మాత్రం వద్దంటానా? మీరెట్లా చెప్తే అట్లనే" అని నేను గూడా భారమంతా ఆయనపైనే వేసినాను.

"చూడవయ్యా వెంకటపెరుమాళ్లూ! న్యాయాన్ని గురించి, ధర్మాన్ని గురించి ప్రస్తావించినావు గనక చెప్తున్నా! చట్టమనేది ఒక చీకటిగది. ధర్మమనే దీపం వెలిగించి పెట్టకపోతే అందులో ఏదేది ఎక్కడుంటుందో తెలియదు. చట్టమెప్పుడూ ధర్మానికి లోబడి వుండాల. అయితే మా న్యాయస్థానం వాళ్ళు చిన్నపామునైనా పెద్ద కట్టెతో కొట్టాలని చూస్తారు. పెద్ద పాము తప్పించుకొని పోతున్నా గుడ్లు మిటకరిస్తా గమ్మునుండిపోతారు. ఆచారి తప్పే చేసినాడనుకో! మొదటిసారిగదా అని మన్నించి వదిలేస్తే ఇంకపైన బుద్ధిగా మసలుకొంటాడు. అతని సంసారం చెడిపోదు. పరువు పోవడం వల్ల అతని నడ్డి విరిగిపోదు. కానీ చట్టానికటువంటి పెద్ద మనసుండదు. సాక్ష్యమనేది వుంటే శిక్ష పడవలసిందే! కూట సాక్ష్యాలతో కొంపలు ముంచేవాళ్ళం గదా మేము!"

"ముంచనూగలరు. కావాలంటే తేల్చనూ గలరు" అని నేను ఆయనతో మాట కలిపినాను.

"సరేలే. మాకు తెలియని మాయలా! ఆ సంగతలా వుండనీ, నువ్వు చెయ్యాల్సిందేమో విను. రేపటి కేసులో విచారణ మొదలుపెట్టబోయేది గవర్మెంటు ప్లీడరు. అసిస్టెంటు పబ్లిక్ ప్రాసిక్యూటరు అంటారులే! భీమసేనారావని పేరు! పేరుకుతగిన ఆకారమే! బొద్దుగా ఇంతింతలావు మీసాలుంటాయి. చాలా గట్టిగా అరుస్తాదులే! మరేం భయపడొద్దు. ఉన్నదున్నట్టుగా, జరిగింది జరిగినట్టుగా బదులు చెప్పు. ఆఖరున నిన్ను క్రాసుపరీక్ష చేయబోయే వాణ్ణి నేను. అప్పుడు మాత్రం నేనిప్పుడు ఎట్లా చెప్తానో, అట్లా చెప్తే చాలు..."

"సెలవివ్వండి" అనినాను.

అయ్యంగారు మంత్రోపదేశం ప్రారంభించినాడు. ముగిసేటప్పటికి గోడగడియారం తొమ్మిదిసార్లు మోగింది.

మరునాడు కేసంతా అనుకొన్నట్టే కొనసాగింది. భీమసేనరావు ఆర్భాటం చెప్పతరం గాదు! ఆచారిని అదిలించి పారేసినాడు. అతడుగూడా అంతా నిజమే చెప్పినాడుగానీ, ఆ

నిజానికి గూడా ఒక మెలిక వుండిపోయింది. "ఎవడో తెచ్చి చవక ధరకు అమ్మినాడు. ఊరూ, పేరూ తెలియదు. గుర్తుపట్టలేను" అనే చోట మాత్రం తొణక్కుండా, బెణక్కుండా వుండిపోయినాడు.

ఆచారి తర్వాత బోనులో కెక్కాల్సిన వంతు నాకే వచ్చింది. గెలుపు గర్వంతో త్రుళ్ళిపడిపోతా భీమసేనరావు నా వంక తిరిగినాడు. ఆయనడిగిన ప్రశ్నలకు నేనెంతో బుద్ధిగా, ఆయనకు ఒప్పిదమయ్యేటట్టుగా జవాబులిచ్చినాను. అంతటితో తన పని తృప్తికరంగా పూర్తయిపోయిందన్న భావనతో రావు చేతులూపుకుంటూ వెళ్ళి తన కుర్చీలో తాను బైటాయించినాడు.

అప్పుడిక నెమ్మదిగా పైకి లేచినాడన్నా అయ్యంగారు. మెల్లగా వచ్చి నాకు దగ్గర్లో నిలబడి "ఏమయ్యా టీచర్! ఇనప సామాన్లను నువ్వు మొదటిసారిగా ఎప్పుడు చూస్తివి?" అని ప్రశ్నించినాడు.

"ఫలానా తేదీన చెంగ్రలాయాచారి ఇంటి ముందర పోలీసుల సమక్షంలోనే చూచినానండీ! అప్పటికెందరో గ్రామస్తులు గూడా అక్కడ గుమిగూడిపోయివుండిరి" అనినాను.

"మంచిది. ఇనుప సామాన్లను మళ్ళీ ఎప్పుడు చూస్తివి?"

"ఇదో, ఇప్పుడే టేబిలుపైన పెట్టిన అట్టపెట్టెల్లో చూస్తావున్నానండీ!"

"సరే. ఇప్పుడు నేనడిగే ప్రశ్నకు జాగ్రత్తగా జవాబు చెప్పు. అప్పుడు నువ్వు ఆచారి ఇంటిముందు చూచిన వస్తువులు. ఇప్పుడిక్కడ చూస్తున్న ఉరువులూ ఒకటేనని చెప్పగలవా?"

నేను కొన్ని క్షణాలపాటు సందిగ్ధంలో పడిపోయినట్టుగా, నోటికి తాళం బిగించినాను. అదేపనిగా అట్టపెట్టెలోవున్న వస్తువులవైపు చూచినాను. ఆ తర్వాత తల పైకెత్తి "ఒకసారి పరికించి చూడాలండీ!" అనినాను.

"చూడొచ్చు" మేజిస్ట్రేటు గారు అనుమతించారు.

నేను బోను దిగి వెళ్ళి బల్లదగ్గర నిల్చుకొన్నాను. ఒక్కొక్క పెట్టెను చూపుల్తోనే శోధించినాను. ఒకసారి టేబిలు చుట్టూ తిరిగి, కొన్ని కొన్ని ఉరువుల్ని పైకి తీసి, మళ్ళీ అందులోకే దిగవిడిచినాను. ఇంతా చేసిన తర్వాత తల పైకెత్తి అయోమయంగా అయ్యంగారి వైపు చూచినాను.

"ఏమంటావు?" అనినారాయన.

"ఆ రోజక్కడా కొన్ని వస్తువులు చూచినానండీ! ఈ రోజు ఇక్కడా కొన్ని వస్తువులు చూస్తావున్నానండీ! కానీ 'అవే యివి' అనిగానీ, 'ఇవే అవి' అనిగానీ చెప్పలేనండీ?" అనినాను.

"అయితే పాతవాటి స్థానంలో కొత్తవేవైనా బదలాయించి వుండటానికి ఆస్కారం లేదని చెప్పగలవా?"

పైకప్పు తల పైన కూలిపోయినట్టుగా భీమసేనరావు ఈడ్చి వదలిపెట్టిన రబ్బరుబంతి మాదిరిగా ముందుకు దూకినాడు. "అయ్యా, నేనభ్యంతరం చెప్తున్నాను. ఇదంత ఏదో లాలూచీ వ్యవహారంగా వుంది. ప్రతివాది తరపు ప్లీడరు పోలీసులే నేరస్థులుగా నిరూపించడానికి ప్రయత్నిస్తున్నట్టు నేననుమానిస్తున్నాను" అని ఆరోపించినాడు.

అప్పుడు నీరెత్తిన నిమ్మలాగున శాంతంగా ఒక మాటన్నాడయ్యా అయ్యంగారు, "ఘనత వహించిన కోర్టువారు మన్నించాల! పోలీసుల్ని గురించి నాకన్నా, గౌరవనీయుడైన నా మిత్రునికే బాగా తెలిసి వుంటుందని నేను నమ్ముతున్నాను".

కోర్టంతా ఘొల్లున నవ్వేసింది.

ఆనాటికి కేసు వాయిదా పడింది. మరువాయిదా రోజు మేజిస్ట్రేటు గారు నేరస్థుణ్ణి మందలిస్తూ యాభై రూపాయలు జుల్మానా విధించి కేసు తోసేసినారు. ఆచారికి ఏనుగెక్కినంత సంబరమైపోయింది.

అయితే అయ్యంగారు మాత్రం ముఖం చిన్నబుచ్చుకున్నాడు. "అపరాధం పడింది గదా! నాకు నువ్వేమీ ఫీజు యివ్వొద్దులే!" అంటూ తిరిగి చూడకుండా వెళ్ళి జట్కాలో కూర్చొన్నాడు.

అయితే ఆ మాటను చెవిలోనే వేసుకోలేదు చెంగల్రాయాచారి. వారం రోజులు తిరక్కముందే చింతపండూ, నెయ్యీ గాకుండా, కొబ్బరికాయలు, బెల్లం ముద్దలుగూడా సమకూర్చుకొన్నాడు. నువ్వు కూడా రావలసిందేనని బలవంతపెట్టి నన్ను గూడా తిరుపతికి బయల్దేరదీసినాడు. నడవలో మనుషుల అలికిడి విని బయటికొచ్చిన ఇంటి ఇల్లాలు పనిమనిషిచేత మేము తీసుకొని వెళ్లిన సంబారాలను లోపలికి చేరవేయించింది. తలపాగా పెట్టుకొని నల్లకోటు తొడుక్కొని కోర్టుకు బయల్దేరబోతూవున్న అయ్యంగారు గుమ్మం దగ్గరకొచ్చి నిలబడి, "అయితే నేను చెప్పిందేమి? నువ్వు చేసిందేమి?" అని ఆచారిని గదమాయించినాడు.

"అయ్యంగారూ! నమస్కారమండీ! మీ మేలు నేను జన్మంలో మరచిపోలేను" అని చేతులు జోడించినాడు ఆచారి.

అప్పుడు సివిల్, క్రిమినల్ కేసులు రెండింటిలోనూ సవ్యసాచి అయిన కపిస్థలం చినదొరస్వామి అయ్యంగారు ఒళ్ళంతా పులకరించి పోయేలా ఒకటన్నాడయ్యా రత్నం!

"నాయనా ఆచారీ! కొండపైన వెంకట పెరుమాళ్లు దేవుని రూపంలో వుంటాడు. కొండకింద దేవుడు మానవుల రూపంలో వుంటాడు. ఇతరులు చేసిన తప్పుల్ని మన్నించడం మానవుల్లోని దైవాంశం. మీ ఊరి అయ్యవారు, మా ఊరి మేజిస్ట్రేటు గూడా నిన్ను మన్నించేసినారు. వాళ్లకు పెట్టవయ్యా నమస్కారం! కూలికి పనిచేసేవాణ్ణి, నాదేముంది?"

● స్వాతి వార పత్రిక 1994 ●